
# అధికారం

ప్రఫుల్లచంద్ర



కొత్తగా బదిలీఅయి వచ్చిన డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్—కుమారి ఈశ్వరి అంటే ఆ జిల్లాలోని ఉపాధ్యాయులందరికీ చలిజ్వరం వస్తుంది. ఆమె చండి, అపరకాళి! అని పేరు పొందింది. రూపంలోనే కాదు, కాఠిన్యంలో కూడా ఆమె కాళియే! ఆమె ఇన్‌స్పెక్షన్‌కు వస్తే చాలు ఉపాధ్యాయులు గుండెల్ని అరచేతిలో పెట్టుకుంటారు. ఈ గండం గడిచి గట్టు ఎక్కితే-సహస్ర నామార్చన చేయిస్తామని కాళీదేవికి మొక్కుకుంటారు కొందరు.

అలాంటి ఈశ్వరి రేపే ఆ స్కూలు ఇన్‌స్పెక్షన్‌కు వస్తున్నది! హెడ్మాస్టరు సుందర రామయ్య గుండె బితుకు బితుకు మంటున్నా, పైకి గంభీరంగానే కనిపిస్తున్నాడు.

నిజానికి అతడు భయపడవలసిన పని లేదు. బుజావర్తనుడు. ఒళ్ళు వంచి పని చేయడమేగాక ఇతరుల చేత పని చేయించగల సమర్థుడు. పూర్తి పెద్దల మన్నన పొందినవాడు. అతని ప్రత్యేకశ్రద్ధ వల్లనే పిల్లలకు రెండు అక్షరం ముక్కలు వస్తున్నాయని పెద్దల నమ్మిక. పూర్వపు ఇన్‌స్పెక్షనులలో కూడా మంచి రిమార్కు సంపాదించాడు. కాని విద్యా విధానంలో వచ్చిన మార్పువల్ల—ఎవరు ఎంత కష్టించినా పదవ తరగతి పరీక్షా ఫలితాలు మాత్రం అంత సంతృప్తికరంగా లేవు. ఈ విషయంలో మాత్రం ఈసారి "దీవనలు" తప్పవు—అనుకున్నాడు సుందర రామయ్య.

తొమ్మిదిన్నరకే వస్తుందనుకున్న జీపు పదకొండు గంటలకు వచ్చింది. ఎదురేగి, చేతులు జోడించి నమస్కరించాడు సుందర రామయ్య. దిగిన అధికారిణిని చూచి-ఈమెను ఇంతకు పూర్వం ఎక్కడ చూశానా—అని ఆలోచనలో పడ్డాడు! ఆమె కూడా అతనిని గుర్తించింది కాబోలు "ఓ! నువ్వా!" అంది. ఆ అనడంలో ఎంత అసహ్యం, ఎగతాళీ కలగలిశాయో అతడు మాత్రమే గుర్తించి ఉలిక్కిపడ్డాడు!

విద్యాశాఖాధికారులకు ఉపాధ్యాయులు కూలి వాళ్ళలా కనిపిస్తారు కాబోలు! "ఏమయ్యా పంతులూ!" అని సంభోదించడమే వాళ్ళు వీళ్ళకిచ్చే గొప్పవరం! "నువ్వు" అని తప్ప "మీరు" అనలేరు అధికారులు. విద్యాశాఖలో పనిచేసే గుమాస్తాలు కూడా—ఏదైనా పని మీద వచ్చే ఉపాధ్యాయులను కనీసం కూర్చోమనరు. ఉపాధ్యాయుడైన పాపానికి—శిష్యుడులాంటి గుమాస్తా ముందు అతడు నిలబడే మాట్లాడాలి! విద్యాశాఖలోనే ఇంత గౌరవం పొందుతున్న ఉపాధ్యాయుడు ఇక వూళ్ళో ఎలాంటి గౌరవంపొందుతాడో వూహించవలసిందే. అయితే అధికారులు హెడ్మాస్టర్లను మాత్రం కాస్త గౌరవంగా చూస్తారు. మరి ఈమె తనను కూడా "నువ్వా!" అంటూ ఏకవచనంలో సంభోదించే సరికి ఉలిక్కిపడ్డాడు సుందరరామయ్య. ఆ సంబోధనలోనే ఆమె చేయబోయే ఇనస్పెక్షన్ యొక్క తీవ్రత తెలుస్తూంది.

తనకోసం ప్రత్యేకించబడిన గదిలో కాసేపు విశ్రమించి, క్లాసులు చూడడానికి బయలుదేరిందామె. గదులన్నీ చక్కగా అలంకరింపబడి ఉన్నాయి. ఇన్‌స్పెక్షన్ అనేసరికి పిల్లలు తమ గదులను సముత్సాహంతో అలంకరించి మెప్పు పొందాలని చూస్తారు కదా.

"ఏమిటి శోభనం గదుల్లా ఈ అలంకరణలు? ఎన్ని రోజులు పాఠాలు ఎగగొట్టి ఈ పనులు చేయించారు?" కస్సుమంది ఈశ్వరి! ఆమె ధోరణికి సుందరరామయ్య విస్తుబోతే, పిల్లలు హడలిపోయారు.

ఇక ఆమె ఇన్‌స్పెక్షన్ గూడా ఉపాధ్యాయులకు రంపపు కోతగానే పరిణమించింది. పిల్లల ముందే ఆమె వారిని అవమానించింది. వారి టీచింగ్ నోట్సు అంతా చీటింగ్ నోట్సు అంటూ విసిరి కొట్టింది. ఆ భద్రకాళి ముందు గడగడలాడిపోతున్న మాస్టర్లను చూచి-విద్యార్థులు నవ్వుకుంటున్నారు.

పరిస్థితిని సర్దుబాటు చేయడానికి సుందర రామయ్య ప్రయత్నించాడుగాని, ఆమె మరింత రెచ్చిపోయింది. ఆమెతో వచ్చిన ఇద్దరు అసిస్టెంటులు కూడా "అమ్మగార్ని" చూచి తాము కూడా అంతస్తుకు తగినట్లు ఎగరడం ప్రారంభించారు. వాళ్ళు పిల్లల నోట్సులు తనిఖీలు చేశారు. చాలా మంది పిల్లలు పుస్తకాలకు సినిమాతారల బొమ్మలు అట్టలుగా వేసుకున్నారు.

"మీరు నేర్పేది సినిమాలా? పాఠాలా?" అని మేష్టర్లమీద విరుచుకు పడి, అట్టల్ని చించేసి అవతల పడేశారు, ఇన్‌స్పెక్టర్లు. పాఠశాలలో ఒక విధమైన భీభత్స వాతావరణమే నెలకొంది. ఈలోగా "అమ్మగారికి" ఆకలి వేసింది. ప్రత్యేక గదిలో విందు భోజనం సిద్ధంగానే ఉంది. స్కూలు ఇనస్పెక్షన్-అంటే చాలువూళ్ళో పెద్దలు వంతులు వారీగా భోజనం ఏర్పాటు చేస్తారు. ఈ పూట ఆ వూళ్ళో మోతుబరి వంతు. పలావు, స్వీట్లు, గడు పెరుగూ, పెళ్ళి భోజనంలా—వంపాడు [illegible]

[illegible]గా భోజనం చేసి, కాసేపు నిద్రపోయి, కొ[illegible]బ్బరితో మొహాలు రుద్దుకున్నారు [illegible]

"ఉతికినవే అయినా — ఇంకొకరు ఉపయోగించిన తువ్వాళ్ళు నాకు వద్దు. కొత్తవి పంపండి' కబురు పంపాడు బుర్లి ఇన్‌స్పెక్టరు. కొత్త తువ్వాళ్ళతో తుడుచుకోవడం ఇబ్బందిగానే ఉంటుంది. అయినా వాళ్ళు అడిగారు కాబట్టి తెప్పించాడు సుందర్రామయ్య — ముగ్గురికీ మూడు. బలం పుంజుకుని క్లాసులలో మరింతగా విజృంభించారు వాళ్ళు.

సాధారణంగా — హెడ్మాష్టరుగారి క్లాసును తనిఖీ చేయరు అధికారులు. చేసినా, నామమాత్రంగానే చేస్తారు. కాని ఈశ్వరి అతనిని పాఠం చెప్పమంది. చక్కగా చెప్పాడు. పిల్లలు కూడా బాగా సమాధానాలు చెప్పారు. ఈశ్వరికి సంతృప్తి కలగలేదు. ఎలాగైనా అతనిని అవమానించాలని నిర్ణయించుకున్నదేమో.

"నేను వస్తానులే." — ఈ వాక్యాన్ని ఇంగ్లీషులోనికి తర్జుమా చేయమని అడిగింది.

ఏ భాష ప్రత్యేకత ఆ భాషదే. వాక్యం చిన్నదే అయినా అలాంటి ప్రయోగం ఇంగ్లీషులో లేదు. ఆ భావం వచ్చేట్టు విద్యార్థులు కొన్ని వాక్యాలు చెప్పారు గాని ఆమెకు తృప్తి కలగలేదు. ఇక వాళ్ళు చెప్పలేకపోయారు.

"ఇదేనా మీరు చెప్పే చదువు?" సుందర్రామయ్యని చూస్తూ గర్జించింది.

"మీరేదో ఉద్ధరిస్తారని తలిదండ్రులు పిల్లల్ని మీ వద్దకు పంపిస్తున్నారు. వీళ్ళేమో చిన్న చిన్న వాక్యాలు కూడా చెప్పలేకపోతున్నారు. క్లాసులో మరి మీరేం చెబుతున్నారో నా కర్థం కావటం లేదు. ఇదేనా భావి భారత పౌరుల్ని తీర్చిదిద్దే విధానం?— మీరు చేస్తున్నది దేశసేవా? దేశద్రోహమా?"

అతని కళ్ళల్లోకి సూటిగా చూస్తూ బాణాలు వదులుతోం దామె. అసలే వికారమైన ఆమె మొహం కోపంవల్ల మరింత భయంకరంగా ఉంది. గుండెలు అరచేతిలో పెట్టుకుని 'తాటకి' అని లోలోపే తిట్టుకొన్నారు కొందరు. తమ ప్రియతమ ఉపాధ్యాయుడు — ఆమెకు గట్టిగా సమాధానం చెబితే బాగుండును— అనుకున్నారు కొందరు. తమ వల్ల మేష్టారు తిట్లు తింటున్నారే — అని బాధ పడుతున్నారు కొందరు! ఈ అవమానం దుస్సహంగా అనిపించింది సుందర్రామయ్యకు.

"మాడమ్! సరియైన సమాధానం నాకూ తెలియదు ... మీరు చెప్పండి" అన్నాడు నిదానంగా.

ఖంగుతిన్న దామె. అధికారులకు ప్రశ్న లడగడమే గాని జవాబు లివ్వడం తెలియదు! సరియైన సమాధానం ఆమెకూ తెలియదు!

ఆమె తటపటాయింపు చూచి మళ్ళా అడిగాడు సుందర్రామయ్య. ఈ సారి దృఢంగా!

"ఈవిడకూ తెలియదుహోయ్!" వెనుక బెంచీలో ఎవరో అన్నారు. క్లాసంతా నవ్వులు!

తోక తొక్కిన నాగినిలా బుస్సుమంది ఈశ్వరి. సుందర్రామయ్యను కోరగా చూస్తూ 'పశువులు! క్రమశిక్షణ లేదు.'' హుంకరిస్తూ బయటకు వెళ్ళిపోయింది. ముక్కు, చెవులూ తెగిన తాటకి పరిగెత్తుతున్నట్టు అనిపించి, విద్యార్థులు నవ్వుతున్నారు.

జరిగిన విషయం విని — ఎందుకైనా మంచిదని మిగిలిన మాష్టర్లు ఆమెకు ప్రత్యేక గదిలో "సహస్రనామార్చన", "గంధాభిషేకం", "గ్రహ శాంతి పూజ' మొదలుపెట్టారు. అరగంట అర్చన తర్వాత ఆమె శాంతించి, ఆ నాటికి తనిఖీ ఆపివేసి — రేపు ఉదయం వస్తానంటూ జీప్ ఎక్కింది.

ఎక్కడకు ఇన్‌స్పెక్షన్‌కు వెళ్ళినా, రాత్రికి ఇంటికి వచ్చేయడం ఆమె అలవాటు. ఆమెతో వచ్చిన ఇన్‌స్పెక్టర్లు మాత్రం అక్కడే ఉండడానికి నిర్ణయించుకున్నారు. (ఇంటికి వెళితే వాళ్ళకు చప్పిడి మెతుకులే. ఇక్కడయితే విందు భోజనాలూ, ఉపచారాలూను మరి.)

ఆ సాయంకాలం మాస్టర్లంతా సుందర్రామయ్య ఇంట్లో సమావేశం అయ్యారు. అందరికీ బాధగానే ఉంది. "తాటకి"ని తిట్టుకున్నారు. రేపటి ఇన్‌స్పెక్షన్ మరింత తీవ్రంగా ఉంటుందని తెలుస్తూనే ఉంది. అందరూ కలిసి ఆమెకు నిరసన తెలియజేయడమా? ఆమె దుర్భాషలను గాలికి వదిలేసి రేపు ఒక్క రోజు తలవంచితే సరిపోతుందా? ఆమె రాక్షసత్వం గురించి పై అధికారులకు రిపోర్టు చేయడమా? తర్జన భర్జనలు జరిగాయి.

"సమ్మెచేద్దాం" అంది ఉడుకు రక్తం.

"సమ్మెవల్లా, రిపోర్టుల వల్లా విద్యాశాఖలో ఏ పనీ సాధించలేం" అంది అనుభవం.

"అధికారి అరిచాడంటే అతనికి మేత కావాలన్న మాట! మన గ్రామం చేనేత వస్త్రాలకు ప్రసిద్ధి కాబట్టి తలా పదో, పరకో చందా వేసుకొని చీర కొని ఆమెకు నైవేద్యం పెడదాం" అన్నది "లోకజ్ఞానం" నైవేద్యం పెట్టడానికి సుందర్రామయ్య ఒప్పుకోలేదు. ఉడుకు రక్తానికూడా ఈ సలహా నచ్చలేదు.

"తాటకి ముక్కు చెవులూ కోసి పంపిస్తే సరి!" అన్నాడు నిప్పుల్రావు!

"ఆమె పరిస్థితిని కూడా మనం అర్థం చేసుకోవాలి నాయనా. ఆఫీసులో కాక ఇంట్లో కలుసుకుంటే ఆమె చాలా సౌమ్యంగా ఉంటుందట. తెలిసిన వారు ఆమె క్రూరత్వానికి ఒక కారణం చెబుతారు. అనాకారిత్వం వల్ల ఆమెకు వివాహం జరగలేదు. అందువల్ల మగజాతిమీద ద్వేషం పెంచుకొని — పెళ్ళి ప్రసక్తి ఇక విరమించి — పట్టుదలగా పై చదువులు చదివి, ఈ ఉద్యోగం సంపాదించిందామె. నిరాశా, నిస్పృహలకు లోనైన వృద్ధ కన్యల మనస్తత్వం నీకు తెలియదు నాయనా. ఆమెకు ఈ ఉద్యోగం దొరకడం — కల్లు తాగి నిప్పులు తొక్కిన కోతి చేతికి కొబ్బరి కాయ దొరికినట్టు అయింది. అందువల్ల రేపు ఒక్క రోజూ మనం తలలు వంచుకొని తరవాత చీర సారెలతో మృదు భాషిణి గార్ని ఆమె ఇంటికి పంపుదాం. అందువల్ల ఇక్కడ ఆమె చిందులు వేసినా — మన మీద చెడుగా రిపోర్టు వ్రాయదు" అన్నాడు వయసులో పెద్దవాడైన పండితుడు. అతని ఇంట్లోనూ వృద్ధ కన్య లున్నారు. అందువల్ల వారి మనో భావం అతనికి బాగా తెలుసు.

సుందర్రామయ్య [illegible]చుకున్నాడు. అతని మనసు అతలాకుతలం అయింది. ఈశ్వరిపట్ల రవంత జాలికూడా కలిగిందతనికి. ఈ లోగా జవాన్ వచ్చాడు.

ఒక ఇన్‌స్పెక్టరు సినిమాకు వెళ్తాడట. ఇంకో ఆయనకు మాస పత్రికలు కావాలిట. ఇద్దరూ టూత్‌పేస్టూ, బ్రష్‌లూ మరిచిపోయి వచ్చారట. ఉదయానికి అవి కావాలట.

జవాన్‌కి ఇరవై రూపాయలిచ్చి పంపాడు సుందర్రామయ్య. అది చూచి ఉడుకురక్తం మరిగింది.

"వీళ్ళు ఇన్‌స్పెక్టర్లా? మనుగుడుపు పెళ్ళి కొడుకులా? మనం పెట్టినవి పీకమొయ్య తిని మళ్ళా మనల్నే తిడతారు. ఛీ. మేస్టారి ఉద్యోగం అంత నికృష్టం మరొకటి లేదు." అన్నాడు ఆవేశంగా నిప్పుల్రావు.

మర్నాడు ఇన్‌స్పెక్షన్‌లో నిప్పులు చెరిగింది ఈశ్వరి. ఉపాధ్యాయుల గుండెల్లో రైళ్ళు పరిగెత్తించింది. పిల్లల గుండెల్లో బండల్ని దొర్లించింది.

"ఈమె తాటకి కూడా కాదు. గోడ్జిల్లా." అనుకున్నారు పిల్లలు. తనిఖీ చివర్లో జరిగిన సమావేశంలో ఉపాధ్యాయుల్ని నిప్పుల మీద కూర్చోపెట్టింది. వాళ్ళు తల ఎత్తుకోలేకుండా చివాట్లు పెట్టింది.

అమ్మగారు చీరతో శాంతించరు. ఏ టేప్ రికార్డరో ఇవ్వాలి అనుకుంది అనుభవం.

ఆమె వాక్ ప్రవాహం విజృంభిస్తూనే ఉంది.

భావి భారత పౌరుల్ని నాశనం [illegible] మీరంతా దేశద్రోహులంది. [illegible] వాళ్ళు నూటికి నూరు శాతం పరీక్షా ఫలితాలు సాధిస్తే మీరు యాభై శాతం కూడా సాధించలేరు. ఇది కేవలం మీ అసమర్థత — అంది.

ఆ మహా ప్రవాహాన్ని అడ్డగించే శక్తి అక్కడ ఎవరికీ లేకపోయింది.

• • •

"అమ్మగారూ! సుందర్రామయ్యగారు వస్తున్నారు" చెప్పాడు భద్రం.

"ఓ!"

ఆ ఒక్క శబ్దం వింతగా వినిపించి, "ప్రవేశపెట్టనా?" అడిగాడు.

"ఈ గదిలోని కుర్చీలన్నీ తీసేసి, అతనిని రమ్మను."

ఆశ్చర్యపోయాడు భద్రం.

"చెప్పినట్టు చెయ్యి." విసుక్కుంది ఈశ్వరి. కుర్చీలన్నీ లోపలి గదిలో పెట్టేసి, సుందర్రామయ్యను ప్రవేశపెట్టాడు భద్రం. చుట్టూ చూశాడు సుందర్రామయ్య.

ఎదురుగా ఉన్న సోఫాలు మీదకు కాళ్ళు చాపుకొని, వాలు కుర్చీలో కూర్చున్నది ఆమె. అప్పుడే తలంటుకున్నదేమో — ఆరడానికి జుత్తు పరబోసుకొని ఫాన్ పెట్టుకుంది. అతని రాకను గమనించనట్టు వార పత్రిక చదువుకుంటోంది.

ఒక క్షణం ఎదురు చూచి, చిన్న శబ్దం చేశాడు. పుస్తకంలోంచి తల ఎత్తి— "ఏం ఇలా వచ్చావ్" అడిగింది.

ఆ మొహం చూసి నిజంగా భయపడ్డాడు సుందర్రామయ్య. మహిషాసురుని మీదకు దూక

బోతున్న కాళిలా ఉంది ఆమె.

"నేను మహిషాసురుణ్ణి కాదు మేడమ్" అన్నా వినేటట్లు లేదు! నమస్కారం చెప్పి, యాపిల్‌పండు ఉన్న చేతిని ముందుకు చాచాడు. రెండో చేతిలో ఉన్న సంచిలో ట్రాన్సిస్టరో, టేప్ రికార్డరో లీలగా కనిపిస్తూంది.

"లంచమా?" కరుకుగా అంది.

ఇన్‌స్పెక్షన్ కాస్త కరుకుగా ఉంటే చాలు హెడ్మాస్టర్లు బహుమతులతో పరుగెత్తుకు వస్తారు. స్కూలులో ఎంత కటువుగా ప్రవర్తించినా, రిపోర్టు మాత్రం కాస్త సౌమ్యంగానే వ్రాస్తుందామె. అయితే ఇంతవరకు ట్రాన్సిస్టర్ తెచ్చినవాళ్ళు లేరు. వక్రంగా నవ్వుకుందామె.

"లంచం కాదు మేడమ్!. . . గౌరవం!" యాపిల్‌ని ఎక్కడ ఉంచాలో తోచక దిక్కులు చూస్తూ అన్నాడు సుందరరామయ్య.

'ఏం మగాళ్ళు! వెన్నెముక లేదు! వ్యక్తిత్వం అసలు లేదు. నేనంటే నీకు గౌరవమా?' అనుకుని పళ్ళు నూరిందామె.

స్టూలు మీది పాదాలు కాస్త తొలిగించి అక్కడ ఉంచమన్నట్లు చూసింది. ఆమె పాదాల వద్ద పండు ఉంచాడు సుందరరామయ్య. 'పనిలో పనిగా పాదాల్ని నమస్కరించుకో!' అనుకొని నవ్వుకుంది కసిగా.

ఆమె అతనిని కూర్చోమనలేదు. కూర్చోడాని కక్కడ కుర్చీలూ లేవు. అతనిలోని జీవుడు గోల చేస్తున్నాడు.

"నిన్ను ఇంతకు ముందెప్పుడో చూచినట్లు గుర్తు" ఆ స్వరంలో కసి స్పష్టంగా వినిపించి తల వంచుకున్నాడు. అతడు తల వంచుకోగానే ఆమె వదనంలో దరహాసం మెరిసింది. ఆ దరహాసమూ దుర్భరంగానే తోచింద తనికి.

"ప్రక్క గదిలో కుర్చీ ఉంది తెచ్చుకోవయ్యా!" అంది నవ్వుతూ.

ఇప్పటికి అతనిలో ఏదో నిర్ణయం రూపు దిద్దుకుంది. "నేను నిల్చోగలను" అన్నాడు నిబ్బరంగా.

"ఏం ఇలా వచ్చావ్?"

నిటారుగా నిలుచున్నాడు. సూటిగా చూచాడు "నీతో ఒక విషయం చెప్పి పోదామని. . ." అన్నాడు.

ఆమె ఉలిక్కి పడింది. "మర్యాద తెలీదు?" కస్సుమంది.

"నీవు నేర్పిన మర్యాదే!" నిర్లక్ష్యంగా చెప్పాడు.

దానితో ఆమె హృదయాన్ని ఆవరించి ఉన్న ఏదో తెర తొలిగినట్లు అయింది. స్టూలు మీద నుండి కాళ్ళు దింపి, సర్దుకుని కూర్చుంది. భద్రాన్ని పిలిచి కుర్చీ వేయించింది. కూర్చున్నాడు సుందర రామయ్య.

సౌమ్యంగానే మొదలు పెట్టాడు—"మేడమ్! మీరు సెలవిచ్చినట్లు—సక్రమంగా విధి నిర్వహణ చేయనివారు నిజంగా దేశద్రోహులే. కాని, మీరు, మీ సహాయకులూ మా స్కూలులో ఎంత సక్రమంగా విధి నిర్వహించారో ఒకసారి అయినా ఆలోచించారా? ప్రభుత్వం మీకు భత్యాలిస్తున్నా, మేమూ మీకు ఉచితంగా రాజోపచారాలు అన్నీ

**తేడా**

**వివేకంవల్ల కలిగే అనుభవం మిత్రుడు.**
**అజ్ఞానంవల్ల కలిగే అనుభవం శత్రువు.**

— యాంగ్

జరపాలి! కొత్త తువ్వాళ్ళూ, దుప్పట్లూ, పేస్టూ, సబ్బులూ, సినిమాలూ, పత్రికలూ అమర్చాలి! విందులు సరేసరి! గొంతుమొయ్య మెక్కి అది అరగడానికి కాబోలు మా మీద విరుచుకుపడ్డారు. మీరు చేసింది సక్రమ విధి నిర్వహణ అవుతుందా? మాలో లోపాలుంటే చెప్పవచ్చు. కాని అదేనా చెప్పే విధానం? ఒక కుర్రాడు ఏదో అన్నందుకే మీకంత కోపం వచ్చిందే! అవమానంగా భావించారే! మరి అంత మంది పిల్లల ముందు మీరు ఉపాధ్యాయుల్ని ఎంత హేళన చేశారు! ఎంత అవమానించారు! ! ! "మా మేస్టార్లకేమీ తెలియదు"—అన్న భావం విద్యార్థులలో కలిగించారే! మరి మాకెంత బాధగా ఉంటుంది? మమ్మల్ని ఇలా అవమానించడమే మీ విధి నిర్వహణలో భాగమా? మీ నిర్వచనం ప్రకారమే చెప్పండి—మీరు దేశ ద్రోహులు కారా? ప్రక్క స్కూలుని ఆదర్శంగా తీసుకోమన్నారు. ఆ స్కూలు గురించి మీ కసలు ఏం తెలుసు? తెలుసుకోదలుచుకుంటే రేపు అక్కడికి ఇన్‌స్పెక్షన్‌కి వెళ్ళి—మా స్కూలులో చూపినట్లే మీ ప్రతాపం అక్కడ చూపండి . . . నేను చెబుతున్నా—మీ జీప్ వూరి పొలిమేర దాటదు! . ."

అతని స్వరం క్రమంగా వేడి అందుకుని, కటినత్వం సంతరించుకొని చివరకు సవాలు చేస్తున్నట్లే వినిపించింది. అతడు అక్కడితో ఆగలేదు. మరింత ఆవేశంగా "ఆ స్కూలులో విచ్చలవిడిగా కాపీలు జరుగుతాయి. మీ ఆఫీసు గుమాస్తాలకే లంచం ఇచ్చి వాళ్ళు వాళ్ళకు కావలసిన వాచర్లను వేయించుకుంటారు, పబ్లిక్ పరీక్షల్లో. మీ క్రింది ఆఫీసర్లు పరీక్ష రోజుల్లో ఆ స్కూలు దరిదాపులకు వెళ్ళరు. మీకు చేవ ఉంటే ఈ అన్యాయాన్ని అరికట్టండి. లేకపోతే తెలియనట్లు వూరుకోండి. కాని నిజాయితీగా పని చేసే మాలాంటివాళ్ళను అవమానించకండి" అన్నాడు.

ఒకానొక దుర్బల క్షణంలో ఈశ్వరి మెత్తబడడం వల్ల అతడు ఆవేశంగా మాటలు వదిలేస్తున్నాడు. ఆమెకు కోపం వచ్చేసింది. తన సామ్రాజ్యంలో తిరుగుబాటు తల ఎత్తినట్టూ, తన సింహాసనం కదిలి పోతున్నట్టూ అనిపించిం దామెకు.

"షటప్ మిస్టర్! వూరుకున్నాను కదాని ఇష్టం వచ్చినట్టు వాగకు. ఇక నాకు టైమ్ లేదు. వెళ్ళు" అంది చిరాకుగా.

"వెళ్ళను" స్థిరంగా చెప్పాడు సుందరరామయ్య. లంఘించే సివంగిలా లేచింది ఈశ్వరి.

"నేను చెప్పదలిచింది ఇంకా పూర్తి కాలేదు" అన్నాడు నిశ్చలంగా.

"వాడ్డూ యూ మీన్? నాకు టైమ్ లేదు. షో. . . లేకపోతే నీ మీద క్రమశిక్షణ చర్య తీసుకుంటా. . . నిన్ను సస్పెండ్ చేస్తా. . . ఉద్యోగం లోంచి పీకేస్తా' అరిచింది పిచ్చిగా. ఒక క్షణం అక్కడే ఉంటే నీ మీద పడి కళ్ళు పీకేసేటట్లు భయంకరంగా ఉందామె. అయినా సుందరరామయ్య చలించ లేదు.

"మీకు తెలియదేమో. . . మీరు నన్నేమీ చేయలేరు. . . కూర్చోండి." తన సర్వీసులో ఎప్పుడూ ఇలాంటి ఎదురు దాడి ఎరగని ఈశ్వరి నిర్ఘాంతపోయింది.

"ఈ సంచిలో ఉన్నది చాలా శక్తివంతమయిన టేప్ రికార్డర్. అయితే నేను మీరు భావించినట్టు దీన్ని మీ కివ్వడానికి తేలేదు. మన సంభాషణ రికార్డు చేయడానికే తెచ్చాను. తరవాత నా మీద కక్ష తీర్చుకోవడానికి మీరు ప్రయత్నిస్తే ప్రతి చిన్న శబ్దాన్నీ రికార్డు చేసిన ఈ టేప్‌ని మా ఎమ్. ఎల్. సీ. ద్వారా విధానసభలో వినిపింప చేస్తాను. అధికారులు ఎంత సమర్థవంతంగా పని చేస్తున్నారో కింది వారికి ఎంత మర్యాద ఇస్తున్నారో ప్రభుత్వానికీ, ప్రజలకూ తెలియాలి కదా.' అన్నాడు పంటి బిగువున.

కనుపించని కొరడా ఏదో ఆమె హృదయం మీద చెళ్ళు మనగా, నీరసంగా కుర్చీలో కూలబడిందామె.

తెచ్చి పెట్టుకున్న కాఠిన్యత అవసరం తీరిపోగా, అతని మొహంలో ప్రశాంతత నెలకొంది. స్నేహ మధుర స్వరంతో—"చూడండి మేడమ్! అధికారికి కాఠిన్యం ఎంత అవసరమో సహృదయతా అంతే అవసరం. కాని ఇదేం దురదృష్టమో కాని మన అధికారులకు తిట్టడమే తెలుసు. మంచిని మెచ్చుకోవడం తెలియదు. అది ఆఫీసర్లు చేయకూడని పని అనుకుంటారు. మీరు అనవసరంగా పురుష ద్వేషాన్ని పెంచుకుని, కసి నిండిన గుండెతో "అధికారం' అనే పులి మీద స్వారి చేస్తున్నారు. పులి మీద స్వారి చేసే వారిని చూచి జనం భయపడి పారి పోతారు. అలా పారి పోయేవారిని చూస్తూ ఉంటే స్వారి చేసే వారికి ప్రపంచాన్ని గెలిచినట్టు హాయిగా ఉంటుంది. నిజమే. కాని ఒక్క విషయం గుర్తుంచుకోండి. ఏదో ఒక రోజున పులి తిరగబడి, స్వారి చేస్తున్న వానిని చంపి వేసే పరిస్థితి వస్తుంది. అప్పుడు వానిని రక్షించడానికి కాదు కదా, అతని కోసం కన్నీరు కార్చడానికి. . . ఒక్కరు. . . కనీసం ఒక్కరు. . . మిగలరు" అంటూ లేచాడు.

వెళ్ళబోతూ, ఆగాడు.

"పదేళ్ళ క్రితం పెళ్ళి చూపులకు నేను మీ ఇంటికి వచ్చాను. వివాహానికి అంగీకరించ లేకపోయినా నేను మనసులో చాలా బాధ పడుతూ వచ్చాను. "నాకు అందం లేకపోయినా, హృదయ సౌందర్యం ఉండవచ్చు కదా. పోనీ, వివాహానికి అంగీకరించనా?" అని చాలా మధన పడ్డాను. వూగిస లాడాను, ఆ రోజుల్లో. . ." నెమ్మదిగా అడుగులు వేస్తూ తలుపు వద్దకు వచ్చాడు.

"నా నిర్ణయం సరియైనదే అని ఇప్పుడు రుజువైంది. . . నీ రూపమే కాదు...మనసుకూడా..."

మాట పూర్తి చేయకుండానే తలుపు తెరిచి చకచక వెళ్ళిపోయాడు. అంతవరకూ,అదిమి పట్టిన దుఃఖం ఒక్కసారిగా పొంగి రాగా, భోరున ఏడ్చేసింది ఈశ్వరి. *